క్లుప్తంగా

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి



దేవరుప్పుల: విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఈదునూరి నర్సింహారెడ్డి (ఈఎన్‌ఆర్) అన్నారు. బుధవారం మండలంలోని మాధాపురం ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ దేవరుప్పుల శాఖ సామాజిక సేవలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ అందజేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం దోహదపడే ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించకుండా ఉపాధ్యాయుల తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బూతుకూరి అశోక్ రెడ్డి, సభ్యులు మర్రి పట్టాభి రాం రెడ్డి, గోలి పెద్ద ఉప్పల్ రెడ్డి,గోలి చిన్న ఉప్పల్ రెడ్డి, ఈదునూరి రామచంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు మనోహర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మంచి మిత్రుడిని కోల్పోయా



సంపత్‌రెడ్డి తండ్రి జయపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

చిల్పూరు: ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో అన్నా అంటూ నా వెంట ఉన్న మంచి మిత్రుడు జిల్లా జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డిని కోల్పోయానని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని రాజవరంలో బుధవారం ఆయన సంపత్‌రెడ్డి తండ్రి జయపాల్‌రెడ్డి, తమ్ముళ్లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎడవెల్లి విజయ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచ్ మారేపల్లి తిరుమలకృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు లలితశ్యాంకుమార్‌రెడ్డి, ఉమసమ్మయ్య, జనగాం యాదగిరితోపాటు తదితరులు ఉన్నారు.

కంటి సమస్యలను అశ్రద్ధ చేయొద్దు



బచ్చన్నపేట: ప్రతి ఒక్కరికి కళ్లు ప్రధానమైనవని, వాటికి ఏమైనా సమస్య వస్తే అశ్రద్ధ చేయొద్దని జనగామ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మల్లవరం అరవింద్‌రెడ్డి, క్యాంపు కోఆర్డినేటర్ వంశీ తెలిపారు. మండలంలోని కేసిరెడ్డిపల్లిలో శరత్ మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి హనుమకొండ వారి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. కళ్లు ఎర్రబడినా, నీరు కారినా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు, అద్దాల పంపిణీ, ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని తెలిపారు. శిబిరంలో 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. సర్పంచ్ మల్లవరం దివ్య, ఉప సర్పంచ్ నీల మధు, నాయకులు కాపర్తి హరిప్రసాద్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాజమౌళి, క్యాంపు సిబ్బంది ప్రవీణ్, సుధీర్, అనూష పాల్గొన్నారు.

తాగునీటికోసం ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

తరిగొప్పుల: తాగునీటికి కటకటగా ఉందని, పైపులైను వేసి ఐదు ఏళ్లు గడుస్తున్నా మిషన్ భగీరథ నీరు అందడంలేదని మండలకేంద్రం 2వ వార్డు మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పలు మార్లు అధికారులు, నాయకులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటినానా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి తమ దాహార్తిని తీర్చాలని బింగి విజయ, గాడి లావణ్య, మామిడాల రజిత, మచ్చా లక్ష్మి, మామిడాల రమ డిమాండ్ చేశారు.

మహనీయుడు అంబేడ్కర్



జనగామ: టీజేయూఎస్ ఆధ్వర్యంలో..



కొడకండ్లలో..



నర్మెట్ట చౌరస్తాలో..



లింగాలఘణపురంలో..

మహనీయుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రత్న, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



జనగామ: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిలో పాల్గొన్న నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య తదితరులు



స్టేషన్‌ఘన్‌పూర్: నివాళులర్పిస్తున్న ఎంపీటీసీ దయాకర్ తదితరులు



దేవరుప్పుల: నివాళులర్పిస్తున్న ఎంపీపీ సావిత్రి



పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..



తరిగొప్పులలో..



బచ్చన్నపేట: నివాళులర్పిస్తున్న నాయకులు



చిల్పూరు: గార్లగడ్డతండాలో..



చిల్పూరు: మల్కాపూర్‌లో..



దేవరుప్పులలో.. కాంగ్రెస్ నాయకులు



పాలకుర్తి: రాజీవ్ చౌరస్తాలో..



జఫర్‌గఢ్: హనుమాన్‌తండాలో.. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు యాకన్న రాథోడ్

జామా మసీదులో నిరసన



జనగామ: బాబ్రీ మసీదు కూల్చివేత దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా జామా మసీదులో ముస్లింలు బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు జమాల్ షరీఫ్, కౌన్సిలర్ ఎండీ సమ్మద్, ముస్లింలు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులపై చర్య తీసుకోవాలని మహాజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి రవికుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రడపాక ఆదాం, నాయకులు తాటికాయల ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ దుండగులు అంబేడ్కర్ విగ్రహానికి సంబంధించిన చేతి భాగాన్ని ధ్వంసం చేశారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం



చిల్పూరు: లింగంపల్లికి చెందిన సాయికిరణ్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం సర్పంచ్ ఏదునూరి రవీందర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 2 వేల ఆర్థికసాయంగా అందజేశారు. ఆయన వెంట రచ్చ రవీందర్, మానుక నరసయ్య, ఎల్లయ్య, మణెమ్మ ఉన్నారు.

సంతాపం

దేవరుప్పుల: బీఆర్‌ఎస్ మండల యువజన నాయకుడు వంగాల చిరంజీవి అకాల మృతి పట్ల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషం, జెడ్పీటీసీ పల్ల భార్గవి సుందర్‌రామిరెడ్డి, వైస్‌ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, యువజన విభాగం నియోజకవర్గ, మండల అధ్యక్షులు గడ్డం రాజు, బానోత్ నవీన్ తదితరులు ఉన్నారు.

ఆలయ స్థల వివాదంపై డీపీఓ విచారణ



విచారిస్తున్న డీపీఓ రంగాచారి

లింగాలఘణపురం: మండల కేంద్రంలో పునర్నిర్మిస్తున్న సాయిబాబా ఆలయ స్థల వివాదంపై బుధవారం డీపీఓ రంగాచారి విచారణ చేశారు. ఆకుల నర్సింహులు అనే వ్యక్తి సదరు స్థలం తనకు సంబంధించిందని, అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని ఆలయ నిర్మాణ కమిటీపై డీపీఓకు ఫిర్యాదు చేయగా ఆలయ నిర్మాణ స్థలానికి చెందిన రికార్డులను పరిశీలించారు. నర్సింహులు వద్ద ఉన్న కాగితాలను పరిశీలించి నవంబర్ 28వరకు మాత్రమే ఆ స్థలానికి ఇంజక్షన్ ఆర్డర్ ఉందని, 240 గజాల స్థలం కొనుగోలు చేశానని చెప్పగా తాను నివాసం ఉంటున్న స్థలాన్ని కొలతలు వేసి చూశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల రికార్డులను తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకొని ఎవరెవరికి ఎన్ని గజాలు కేటాయించారో పరిశీలించాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. డీపీఓతో పాటు ఎంపీఓ మల్లికార్జున్ ఉన్నారు. అదేవిధంగా ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పుల్కరం నాగరాజు, సభ్యులు మల్లేశం, తిరుమల్, బీమయ్య, వెంకటేశ్, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుతం సమాజంలో చోటుచేసుకుంటున్న ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ సట్ల రాజు అన్నారు. శివునిపల్లి వివేకానంద చౌరస్తా వద్ద పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులకు ఆన్‌లైన్, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. స్మార్ట్‌ఫోన్‌లో వచ్చే అనవసర మెసేజ్‌లు, లింక్‌లను ఓపెన్ చేయొద్దని, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల ఆన్‌లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని, ఫోన్‌లో వచ్చే ఉచిత ఆఫర్ మెసేజ్‌లకు మోసపోవద్దన్నారు. ఎవరికి బ్యాంక్ అకౌంట్ నంబర్లు, ఓటీపీలు షేర్ చేయొద్దని, ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఏదైనా ఫంక్షన్లకు ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇంటిముందు తాళం వేయవద్దని, ఇంటిలో విలువైన నగలు, నగదు ఉంచొద్దని, లాకర్లలో భద్రపర్చుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, హెల్మెట్‌ను భారంగా కాకుండా బాధ్యతగా ధరించాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న సీఐ రాజు

మాదిగలు ఆర్థికంగా ఎదగాలి



భూమి పూజ చేస్తున్న రవి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఉపయోగించుకొని మాదిగలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి అన్నారు. బుధవారం మండలంలోని ఇప్పగూడెంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రవి మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రతి ఒక్కరూ సమాజంలో బతుకుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పడిశాల సుగుణ వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ గుర్ర యాదగిరి, కత్తుల కట్టయ్య, యాకయ్య, మండశ్రీనివాస్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

లింగాలఘణపురం: జనగామ–సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి లారీ ఢీకొట్టిన సంఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న నెల్లుట్లకు చెందిన గొరిగె అంజయ్య (60) బుధవారం వరంగల్ ఎంజీఎంలో మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య జనగామ నుంచి నెల్లుట్లకు ద్విచక్రవాహనంపై వస్తుండగా జనగామ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రం బాగుపడుతుంది

జనగామ: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం బాగుపడుతుందని గ్రహించి గ్రామీణ ఓటర్లు.. సోనియా గాంధీ నాయకత్వానికి అధికారం కట్టబెట్టారని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీళ్లు, నియామకాలు, నిధుల పేరిట తెలంగాణ తెచ్చుకుంటే, కేసీఆర్ పదేళ్ల పాలనలో అన్నింటిని నిర్వీర్యం చేశారన్నారు. ఆనాడు ప్రత్యేక రాష్ట్రం కోసం హైదరాబాద్ మినహా, రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలే ఉద్యమంలో ముందుండి నడిచాయని, నేడు కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణం సైతం వీరే అన్నారు. కేసీఆర్ ఉద్యమ ఆశయాలను తుంగలో తొక్కి, నియంతలా వ్యవహరించడంతోనే ప్రజలు ఇంటికి పంపించారన్నారు. 26 ఏళ్ల చిన్న వయస్సులో 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న యశస్వినిరెడ్డి చేతిలో పాలకుర్తి నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి దయాకర్‌రావు ఓడిపోయారంటే ప్రజలు ఎంత కసి మీద ఉన్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు శ్రమించిన రేవంత్‌రెడ్డికి సీఎం పదవి కట్టబెట్టి అధిష్టానం సముచిత స్థానం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రకటించి ఆరు గ్యారంటీ పథకాలతో పాటు రేవంత్‌రెడ్డి సొంతంగా చెప్పిన ఏడో గ్యారంటీ సైతం అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు అందిస్తామన్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా నేటి ప్రమాణస్వీకారోత్సవానికి భారీ సంఖ్యలో తరలి వెళ్తామన్నారు. నాయకులు ఎర్రమల్ల సుధాకర్, ఎండి అన్వర్, చెంచారపు బుచ్చిరెడ్డి, ఎండి గౌస్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ నాయక్

గోదాం వినియోగంలోకి తెచ్చేదెప్పుడో..?

- రాజవరంలో వృథాగా వ్యవసాయ ఉత్పత్తులు నిల్వచేసే గిడ్డంగి
- శిథిలావస్థకు చేరుతున్న భవనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

చిల్పూరు: మండలంలోని రాజవరంలో నాలుగేళ్ల క్రితం రైతులకోసం తెలంగాణ నీటిపారుదల, చెరువు ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.39లక్షల వ్యయంతో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకోసం నిర్మించిన గిడ్డంగి వినియోగంలోకి తేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటోంది. గోదాంను నిర్మించిన 8 నెలలకే వర్షాలకు నీరు నిలిచి గిడ్డంగి చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ కూలిపోయింది. అలాగే లోపల ధాన్యం ఆరబోసేందుకే ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాంపై ఉన్న సిమెంటు కొట్టుకుపోయి కంకర తేలింది. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ తిరిగి తూతూ మంత్రంగా గోడ నిర్మించి లోపల అలాగే వదిలేశాడు. దీంతో రైతులకు ఉపయోగంలో లేకుండా పోయింది. ప్రస్తుతం భవనం కూడా శిథిలావస్థలోకి చేరుకుంటోంది. అధికారులు, పాలకులు స్పందించి వెంటనే రైతులకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



గిడ్డంగి ఆవరణలో ప్లాట్‌ఫాంపై తేలిన కంకర

అందుబాటులోకి తేవాలి



లక్షల వ్యయంతో రైతుల కోసం నిర్మించిన ధాన్యం నిల్వచేసే గిడ్డంగిని ఇప్పటికైనా అందుబాటులోకి తేవాలి. ప్రతీసారి రైతులం పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న గోదాం జీవాలకు నిలయంగా మారింది.

- మారేపల్లి కిషన్‌రెడ్డి, రైతు

ప్రమాణ స్వీకారానికి తరలిరావాలి



మాట్లాడుతున్న సాదం గట్టయ్య

చిల్పూరు: తెలంగాణ 3వ సీఎంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన రేవంత్‌రెడ్డి నేడు (గురువారం) హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్నందున నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ జిల్లా నాయకుడు సాదం గట్టయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంపూర్ణ మద్దతుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇక ప్రతీ ఒక్కరికి సమన్యాయం జరగుతుందన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం 6 గ్యారంటీలపై ప్రకటన చేయడంతో పాటు అవి వెంటనే అమల్లోకి వచ్చేలా చేస్తారని తెలిపారు. నారగోని పరమేష్, బత్తిని కిష్టయ్య, భీమగోని పవన్, గొల్లపల్లి వాసు, కొయ్యడ శోభ, శ్రీను, రాజయ్య, కోల రమేష్, శేఖర్, కనకరాజు, నారగోని వెంకన్న, నితీష్, గాదె రాజేందర్, నారగోని రవి, నవీన్ పాల్గొన్నారు.